TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

సంచిక: 23 సంపుటి: 03 ఎడిటర్: సీతార్ల సురేష్ గురువారం 10 ఏప్రిల్ 2025 పేజీలు: 8



విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119


## మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడు

**కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే**

**జనంవెలుగు, న్యూ డిల్లీ, ఏప్రిల్ 9:–** ప్రధాని నరేంద్ర మోదీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తాడని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక ఆర్థికవ్యవస్థ లో ఇప్పుడు గుత్తాధిపత్యం రాజ్యమేలుతోందని, ప్రభుత్వ ఆస్తులన్నింటిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారని ఆయన ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతోంది. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు. కానీ ప్రభుత్వ ఆస్తులను మాత్రం ఒక్కొక్కటిగా మిత్రులకు కట్టబెడుతున్నారు. ఇలాగే కొనసాగితే ఏదో ఒకరోజు ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం ఈ దేశాన్ని అమ్మేస్తారు. నెహ్రూ నిర్మించిన ప్రభుత్వరంగ ఫ్యాక్టరీలు అన్నింటిని మోదీ అమ్ముతున్నారు' అని ఖర్గే విమర్శించారు. 'దేశం కోసం నువ్వేం చేశావు, మేమేం చేశాం.? భవిష్యత్ తరాలకు నువ్వు ఏం ఇవ్వదల్చుకున్నావు.?' అని అడిగితే మోదీ నోరు మెదపరని, కానీ కాంగ్రెస్ పార్టీని నిందించడానికి మాత్రం ముందుంటారని ఖర్గే మండిపడ్డారు. దేశంలో అన్నింటా ప్రభుత్వ ఆధిపత్యమే కొనసాగుతున్నదని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నదని, అందుకే ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.



## విడిసి అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదంతో అణచివేస్తాం

### పోలీస్ కమీషనర్ వెల్లడి


**జనం వెలుగు, నిజామాబాద్:–** గ్రామాలలో గ్రామాభివృద్ధి (విడిసి) కమిటీలు ఏర్పాటు చేసుకుని సామాన్య ప్రజానీ కాన్ని వేధిస్తే ఆయా గ్రామాభివృద్ధి కమిటీలపై ఉక్కు పాదం మోపి అణచి వేస్తామని జిల్లా పోలీసు కమీషనర్ సాయి చైతన్య హెచ్చరించాడు. ఈ గ్రామాభివృద్ధి కమిటీలు గత 15 సంవత్సరాలక్రితం కొన్ని గ్రామాలలో గ్రామాభివృద్ధి కోసం గ్రామభి వృద్ధికమిటీలుగా అవతరించడం జరిగిందని ఆయన అన్నాడు. గ్రామాలలో గ్రామాభివృద్ధి అవసరాలకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు పొందకుండా తమ అవసరాలను తీర్చుకోవడం కోసం గ్రామాభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపాడు. కాలక్రమేణ ఈ గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో అభివృద్ధి కార్యక్రమాలను కాకుండా గ్రామాలలో జరిగే సివిల్ తగాదాలు, భూత గాదాలు, వివాహ సంబంధ తగాదాలు అన్నదమ్ముల తగాదాలు, భార్య భర్తల తగాదాలలో వారిని పిలిపించి, అట్టి పంచాయితీలలో వారు వినని ఎడల వారికి దండుగలు వేసి వేదిస్తారని ఆయన అన్నాడు. చట్టం చేయవలసిన పనిని విడిసి తమ చేతులోనికి తీసుకొని, వాళ్ళను పోలీస్ స్టేషన్ లను, న్యాయ స్థానా న్ని ఆశ్రయించకుండా గ్రామ ప్రజలను తాము చెప్పినవిధంగా వినాలని హుకుం జారీ చేస్తారని ఒక తాము జారీ చేసిన హుకూంని బేఖాతరు చేస్తే వారిని వేధింపులకు గురి చేస్తారని ఆయన తెలిపాడు.



ఎవ్వరూ కూడా పోలీస్ స్టేషనును గాని న్యాయస్థానాన్ని ఆశ్రయించ రాదని హుకుం జారీ చేస్తే, తమ హుకుంని కాదని, విడిసి మాట వినని వారిని ఆ గ్రామం నుండి వెలివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తారని ఆయన అన్నాడు. గ్రామంలో డబ్బులు వసూలు చేయడానికి గ్రామాభివృద్ధి కమిటి పేరుతో బెల్టుషాపులు, కూల్ డ్రింక్ షాపులు, కిరాణ షాపు, కోడిగ్రుడ్డు ధర పై యాక్షన్ (వేలం వేయడం) వేయడంలో ఎవరు ఎక్కువధర చెల్లిస్తారో ఆ వ్యక్తి మాత్రమే ఆ గ్రామంలో ఆ వస్తువులను అమ్మేటట్లు నియమిస్తూ వారి నుండి డబ్బులు వసూళ్ళు చేస్తారని ఆయన అన్నాడు. భారత దేశంలో గల ఏ వ్యక్తి అయినా భారత ప్రభుత్వ చట్టాలను గౌరవించి ఆ చట్టాలకు లోబడే తమ కార్యకలాపాలను నిర్వహించాలని ఆయన అన్నాడు. ఎవ్వరికైనా ఈ గ్రామాభి వృద్ధి కమిటీల వలన ఎలాంటి ఇబ్బందుల వచ్చిన వారు తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్ అధికారిని సంప్రదించగలరని ఆయన తెలిపాడు. కావున భవిష్యత్తులో ఎవ్వరైన ఇలాంటి బహిష్కరణలు చేసినట్లయితే వారిపై చట్టరిత్య కఠిన మైన చర్యలు తీసుకోబడతాయని, ఎవ్వరిని కూడా ఉపేక్షించేది లేదని ఆయ న హెచ్చరించాడు.

## సాగర్ భద్రత అంశంపై బీఆర్ఎస్ నిరసన

**జనంవెలుగు, నల్గొండ:–** నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్ డ్యాం భద్రతపై రాజకీయ దుమారం లేస్తుంది. ప్రాజెక్ట్ భద్రతను ఆంధ్రప్రదేశ్కు చెందిన భద్రతా విభాగాలకు అప్పగించడం వివాదానికి తెరలేపింది. ఈ నిర్ణయాన్ని తెలంగాణ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద




ఎత్తున నిరసనకు దిగారు. డ్యాం భద్రతను ఏపీ పోలీసులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ నల్ల జెండాలతో ఆందోళన నిర్వహించారు. ఇది తెలంగాణ హక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ తెలంగాణ భూభాగంలో ఉన్నందున, దాని భద్రతా బాధ్యత పూర్తిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే చెందాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం జల శక్తి వనరుల శాఖ ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బిఆరెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## అంబేద్కర్ జయంతి రోజున ప్రారంభం కానున్న 'మా భూమి' రథయాత్ర

### జిల్లా కార్యదర్శి రమేష్ మహారాజ్ ప్రకటన



**జనంవెలుగు, నిజామాబాద్:** బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార %జీూజ% మరియు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజాస్వామ్య యుద్ధానికి ముందడుగు వేసే 'మా భూమి' రథయాత్ర ఏప్రిల్ 14న ఆదిలాబాద్‌లో డా. విశారదన్ మహారాజ్ నేతృత్వంలో ప్రారంభం కానుందని జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మహారాజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మాక్లూర్ మండల కేంద్రంలో యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. "రాజ్యం, సంపద, అధికారం, భూమి ం అట్టడుగు వర్గాల ప్రజలకు సాధించేవరకు మా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. 1 లక్ష కిలోమీటర్ల మేర సాగనున్న ఈ యాత్ర, ఆదిలాబాద్ నుండి ప్రారంభమై, హైదరాబాద్ వరకు 3 సంవత్సరాలు 3 నెలల పాటు కొనసాగనుంది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు సమూహంగా పాల్గొని తమ సంఘీభావాన్ని చాటాలని రమేష్ మహారాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కిషన్, సీనియర్ నాయకులు గంగాధర్, సాయన్న, శ్రీహరి, శ్రీకాంత్, మహేష్, మనిష్ తదితరులు పాల్గొన్నారు.

## సంయుక్తకు ఎల్ఓసి అందజేత




**జనం వెలుగు, బాల్కొండ:–** బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండలంలోని దర్మోరా గ్రామానికి చెందిన పత్రి సంయుక్త హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా, తలకు శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్లు సూచించడం జరిగింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సంయుక్తకు తలకు బలమైన గాయంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా శస్త్ర చికిత్స కోసం బాల్కొండ నియోజకవర్గపు కాంగ్రెసు పార్టీ ఇంచార్జి సునీల్ రెడ్డి సంప్రదించగా సిఎం సహాయ నిధి నుండి సుమారు రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని అందించడం జరిగింది.

### ఇన్‌స్టాగ్రామ్ పరిచయం

## ప్రేమగా మారి కిడ్నాప్‌కి దారితీసింది

### ఇద్దరు నిందితుల అరెస్టు




**జనంవెలుగు, నందిపేట్:–** ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి కిడ్నాప్ చేసిన ఘటన నిజామాబాద్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. బాలికను బలవంతంగా తీసుకుపోయి స్నేహితుడి ఇంట్లో దాచిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నందిపేట్ ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం, బోధన్ మండలం సాలూర గ్రామానికి చెందిన మైత్రి రాజు, సాలంపాడు గ్రామానికి చెందిన దంతం రాజు కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. వారు బాలికను వలలో పడేసి తీసుకెళ్లి స్నేహితుడి ఇంట్లో దాచినట్లు తెలిసింది. పోలీసులు నిందితుల వద్ద నుంచి కిడ్నాప్‌కు ఉపయోగించిన ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై అపహరణ మరియు ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి, నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.